క్లుప్తంగా

ఆటో ప్రమాదంలో కూలీలకు గాయాలు

ముద్దనూరు : వ్యవసాయ పనుల నిమిత్తం ఆటోలో ప్రయాణిస్తుండగా ఆటో బోల్తా పడటంతో అందులోని కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. శుక్రవారం పనులకోసం సుమారు 10 మంది కూలీలు ఆటోలో వెళ్తుండగా స్థానిక శ్రీవివేకవర్ధని జూనియర్ కళాశాల సమీపంలో రాయిని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇందులో ఒకరి తలకు గాయమైనట్లు బాధితులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

పులివెందుల రూరల్ : పట్టణంలోని పెద్దజూటూరు రోడ్డు సమీపంలో శుక్రవారం జూదమాడుతున్న ఏడు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.38,400 నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. ఇంకా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తామని మట్కా, జూదం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేముల : మండల పరిధిలోని మబ్బుచింతలపల్లె, వేల్పుల, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె 33 కె.వి. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, గృహాలకు యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

నేడు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

తొండూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు తెలిపారు. కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఐఈఆర్టీ యశోదకు రాష్ట్రస్థాయి సత్కారం



ప్రముఖుల చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న ఐఈఆర్టీ యశోద

వేంపల్లె : విభిన్న ప్రతిభావంతులకు చేస్తున్న సేవలను గుర్తించి ఐఈఆర్టీ యశోదకు సత్కారం చేశారు. భారత చైతన్య యవజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేశారు. దీంతో వేంపల్లెలోని భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఐఈఆర్టీ యశోదకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని బందర్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఈఆర్టీ యశోదకు భారత చైతన్య యవజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, సామాజిక సేవకురాలు రేణు దేశాయి, ప్రముఖ నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా సత్కారం చేశారు. ఐఈఆర్టీ యశోదకు రాష్ట్రస్థాయి అవార్డు రావడంపట్ల ఎంఐఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్‌లతోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల రూరల్ : భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. శుక్రవారం పులివెందల మండలం రచ్చుమర్రిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈనెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్‌అహ్మద్, ఆర్ఐ షేక్షావలి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకట్రామిరెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చిన్నా, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రయాదవ్, ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయం

- కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్
- మరుగుదొడ్లులేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



పిచ్చిమొక్కలతో నిండిన వ్యవసాయ శాఖ కార్యాలయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయం చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో విషపురుగులు సంచరిస్తున్నాయని కార్యాలయానికి వెళ్లే రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పని చేసే సిబ్బంది కూడా మౌలిక సదుపాయాలు కూడా లేవని వారు వాపోతున్నారు. వ్యవసాయ కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్లు చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. పులివెందుల మండల పరిధిలోని రైతులు సంబంధించిన వివరాలను, ప్రభుత్వం అందించే పథకాలను కంప్యూటర్‌లో భద్రపరచాలన్న కంప్యూటర్ లేకపోవడంతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏవైనా పథకాల నమోదు చేయాలన్న, రైతుకు ఇవ్వాల్సిన మందులు, ఎరువులు ఇవ్వాలన్న సెల్‌ఫోన్ల ద్వారానే తెలుసుకోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ మూలన పడింది. అర్బన్ పరిధిలో రైతులకు యూరియా, బీపీటీ ఇవ్వడం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలకు కియోస్కో మిషన్లను సరఫరా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మిషన్ ఎందుకు పనికి రాకుండా మూలన పడేశారు. వ్యవసాయ కార్యాలయమంతా చెత్తాచెదారాలతో నిండి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయ కార్యాలయంలోని సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఏఓ కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్



నిరుపయోగంగా ఉన్న కియోస్కో మిషన్

సరస్వతీదేవిగా వాసవీమాత



శ్రీసరస్వతిదేవీ అలంకారంలో వాసవీమాత

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనుర్మాసం 3వ శుక్రవారం పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆర్.సురేంద్ర ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం వాసవీమాత మూల విరాట్ అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించి, ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. ఉదయం 5 గంటలకు దళ హారతులు, మంత్రపుష్పం వేద మంత్రోచ్చరణతో పూజలు నిర్వహించారు. వాసవీమాతను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కాలేజీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య మహిళలు కుంకుమ పూజ, కుంకుమార్చన, లలితా సహస్ర నామాలు, వాసవీ అష్టోత్తర నామావళి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ, ఆలయ నిర్వాహకులు మోహన్‌రావు, ప్రవీణ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత



నిల్వ ఉన్న నీటిలో అబైట్‌ను పిచికారి చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యాదవారిపల్లె గ్రామంలో శుక్రవారం ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి రెండుసార్లు ల్యాబ్‌కు అందించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పనిసరిగా పాటించాలని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం, సీహెచ్ఓ నందీశ్వరరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

రేపు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులచే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ నిహారిక, ప్రముఖ న్యూరో సర్జన్ వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతికుమార్, ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ పార్థసారథి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ చైతన్యారెడ్డి, ప్రముఖ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ ప్రమోదలు ఆయా వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డాక్టర్ల ఫీజుతోపాటు అవసరమైన వారికి ఎక్స్‌రే, ఈసీజీ, పీఎఫ్‌టీ, ఫైబ్రో స్కాన్ మరియు బోన్ డెన్సిటీ టెస్ట్‌లు ఉచితమన్నారు. ఎస్ఆర్ క్రిటినైన్, బ్లడ్ యూరియ సీబీసీ, టీఎంటీ, 2డీ ఏకో, ఎఫ్ఎల్‌పీ, ఈసీజీ, పీఎఫ్‌టీ టెస్టులు రూ.1800లు, సిటీ బ్రెయిన్ టెస్ట్ రూ1500ల అతి తక్కువ ధరతో నిర్వహించడం జరుగుతుందన్నారు. గుండె, క్యాన్సర్, నరాల, మూత్రకోశ, గ్యాస్ట్రో, సంతాన సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా హిందువుల హైందవ శంఖారావ ర్యాలీ



హైందవ శంఖారావ ర్యాలీలో పాల్గొన్న హిందువులు



ర్యాలీలో కోలాట నృత్యం చేస్తున్న చిన్న పిల్లలు

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుండి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందువుల హైందవ శంఖారావం భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి ఆంజనేయస్వామి ఆలయం మీదుగా గాండ్ల వీధి, కడప రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, గాంధీ రోడ్డు మీదుగా హిందువులందరూ భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఈ ర్యాలీలో శ్రీరాముని ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ర్యాలీ వెంట చిన్నపిల్లల కోలాటం నృత్యాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ రేపు 5వ తేదీన విజయవాడలో జరిగే సమక్షంలో జరిగే హైందవ శంఖారావ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి హిందువులందరూ ఏకం కావాలన్నారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తం చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా హిందువుల మనోభావాలను సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్న లక్ష్యంతో విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సభకు భారీ ఎత్తున హిందువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, సభ్యులు, హిందువులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : స్థానిక తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ శివమునెమ్మ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు హాజరై ఉపాధ్యాయులతో కలిసి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిమ్న జాతి వర్గాల అభ్యున్నతి కోసం తన భర్త జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో పయనించి, వారి అభివృద్ధికి తన కృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలే అని కొనియాడారు. సావిత్రిభాయి పూలే ఆడపిల్లల విద్య కోసం అహర్నిశలు కృషి చేసి వారి జీవితాలలో వెలుగులు నింపిన ఆదర్శమూర్తి అన్నారు. అనంతరం హెడ్మాస్టర్ శివమునెమ్మను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్య దర్శి సంగమేశ్వర్‌రెడ్డి. ఉపాధ్యాయులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

పరామర్శ



గంగాధర్‌రెడ్డితో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చవ్వారెడ్డి గంగాధర్‌రెడ్డి సతీమణి, కమలాపురం నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణిని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. సంధ్యారాణి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు ఆమె నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం సంబటూరు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం మాజీ చైర్మన్ ఇందిర భర్త పెరుగు కేశవ గుండెపోటులో మృతి చెందారు. సంబటూరులోని మృతుని నివాసానికి చేరకుని మృతుని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్‌లిఫ్టింగ్ పోటీలలో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామిగుప్తా, పవర్ లిఫ్టింగ్ కోచ్ గోవిందు తివారీలు తెలిపారు.

విజయవాడ కృష్ణలంకలోని జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీకి చెందిన పీయూసీ-2 విద్యార్థి మహబూబ్ తమ ప్రతిభను చాటాడని, అలాగే శివకుమార్, వైష్ణవి పవర్ లిఫ్టింగ్ పోటీలలో రాణించి బంగారు పతకం సాధించారని డైరెక్టర్ తెలిపారు. అలాగే ఒంగోలు క్యాంపస్‌లోని పీయూసీ- 2 విద్యార్థులు తేజస్విని, చందనలు అత్యంత ప్రతిభను చాటి పతకాలను గెలుచుకున్నట్లు తెలిపారు. పరిపాలన అధికారి రవికుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగ డీన్ అకడమిక్ రమేష్, అనిల్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కు, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లా సమగ్ర శిక్షణ కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలు బలోపేతం చేయాలని, ప్రజలకు పాఠశాలలకు వారధిగా పాఠశాల యాజమాన్య కమిటీలు వ్యవహరించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు వెంకటరామిరెడ్డి, రమాదేవి మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారని, వీటి ఆధారంగా విద్యార్థులు పాఠశాల నుండి డ్రాప్ అవుట్ కాకుండా, పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు. ఇక్కడ నుండి శిక్షణ తీసుకున్న వారు తమ తమ పాఠశాలలలో 4వ లేదా 6వ తేదీలలో మిగతా పాఠశాల యాజమాన్య కమిటీ వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాజమాన్య గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : పాఠశాలల అభివృద్ధికి సిబ్బంది, కమిటీ చైర్మన్‌లు, సభ్యులు కలసికట్టుగా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల రీసోర్స్ కార్యాలయంలో పాఠశాల కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి



తంగెడుపల్లెలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

వీరపునాయునిపల్లె : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో ఎన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి ఎన్ని పంచాయతీల్లో చెత్తను సేకరించడం జరుగుతోంది, ఎన్ని టన్నులు వర్మీ కంపోస్టు తయారు చేయడం జరుగుతోందని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్‌లకు నెలకు రూ.6 వేలు ఇస్తున్నామని ఆ మొత్తానికి పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని దీనిపై పలువురు పంచాయతీ కార్యర్శులు ఆమెకు తెలియజేశారు. 15వ ఫైనాన్స్ ద్వారా పంచాయతీలకు నిధులు అధికంగా విడుదల చేయడం జరిగిందని ఆ మొత్తంలో వారికి మరింత ఎక్కువ అందించి సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించడంతో పాటు వర్మీ కంపోస్టు తయారు చేసేవిధంగా ముందుకు సాగాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెత్తను సేకరించే ట్రై సైకిల్లు ఏవైనా రిపేర్లు ఉంటే పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో పర్యటించి సేకరణ జరుగుతోందా లేదా అన్న దానిపై ప్రతి రోజు రిపోర్టు అందజేయాలని ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రమాదేవి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు బిడ్డకు సాహిత్య పురస్కారం



కౌన్సిల్ ద్వారా సాహిత్య పురస్కారం అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన సామాన్య రైతు అలవలపాటి గంగిరెడ్డి కుమారుడు అలవలపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అరుదైన రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురష్కారం అందుకున్నారు.

నవభారతం అనే పుస్తకాన్ని రచించి 'దావన్ సర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ కౌన్సిల్' ఆధ్వర్యంలో కడప పట్టణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురస్కారం అందుకున్నారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 21 మంది రచయితలు ఈ అవార్డును అందుకున్నారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి అనంతపురంలోని జెఎన్‌టీయూలో ఫుడ్‌సైన్స్ టెక్నాలజీలో పీజీ పూర్తి చేశాడు. అదేవిధంగా మిల్లెట్లతో సిరిల్లాక్ వండి ఫార్ములాను రూపొందించాడు. లండన్‌లోని డెన్‌లాస్ కంపెనీ ఆయన ఫార్ములాను గుర్తించి ఆయనను లండన్‌కు ఆహ్వానించిందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. త్వరలో లండన్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్నారు. డీఆర్‌డీసీ కౌన్సిలర్ల ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురస్కారాన్ని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అందుకోవడంతో ఆయన తల్లిదండ్రులు సంతోషానికి అవధుల్లేవు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతానికి పేద రైతు బిడ్డ ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : గతంలో మాదిరిగానే ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలని, ప్రతి ఇంటికి రేషన్‌ను ఎండీయూ వాహనాల ద్వారా అందించాలని, రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిలు ఆర్డీఓ చిన్నయ్యను కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఆర్డీఓను కలిసి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం జరుగుతోందని, అయితే పులివెందుల పట్టణంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయకుండా ఎండీయూ వెహికల్స్‌కు సంబంధించిన ఆపరేటర్లను తమ బయోమెట్రిక్ పరికరాలు ఉపయోగించి ప్రజలకు రేషన్ పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. దీనివల్ల ప్రజలకు రేషన్ పంపిణీ సరిగ్గ జరగకపోగా అనేక అక్రమాలకు నెలవుగా మారిందని, దీనిపై ప్రజలనుంచి అనేక ఫిర్యాదులు, వినతులు మా దృష్టికి రావడం జరిగిందన్నారు. ఎండీయూ వెహికల్స్‌కు స్టాక్ ఇవ్వకుండా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గతంలో మాదిరిగా ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి

పెండ్లిమర్రి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారిని రాజ్యలక్ష్మి తెలిపారు. పెండ్లిమర్రి గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శిలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని ఇళ్లకు, షాపులకు వంద శాతం పన్ను వసూల్ చేయాలన్నారు. గ్రామాల్లో నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. పారిశుధ్య పనులపై తక్షణం స్పందించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లల్లో వర్మి కంపోస్టు ఎరువులు తయారు అయ్యేలా కృషి చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఈఓపీఆర్డీ శివరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయండి



పులివెందుల నుంచి కడపకు వెళుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పులివెందుల టౌన్ : ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోళ్ల భాస్కర్ కోరారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీ సర్కిల్ వద్ద నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు కోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు భారీగా కడపకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కడపకు విచ్చేసిన ఏకసభ్య కమిటీ చైర్మన్ రాజీవ్‌రంజన్‌ను కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ వేగంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.